సాక్షి
చిత్తూరు

శనివారం । 2 । నవంబర్ । 2024



ప్రగతి తప్పిన ఆర్టీసీ
జిల్లాలోని ఆర్టీసీ గ్యారేజీల్లో బస్సులకు మరమ్మతులు చేయడానికి పరికరాల కొరత వేధిస్తోంది. - 8లో



దుమ్మురేపిన కోడెగిత్తలు
వెదురుకుప్పం మండలం కోణంగిపల్లెలో శుక్రవారం నిర్వహించిన ఎడ్ల పందేలు యువతలో జోష్ నింపాయి. - 8లో



కార్యకర్తలకు అండగా ఉంటాం
వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

కుప్పం రెవెన్యూ అధికారులపై ఆర్డీఓ ఆగ్రహం

– టైపిస్ట్ సరెండర్

కుప్పం : కుప్పం రెవెన్యూ శాఖపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఆర్డీఓ శ్రీనివాసులురాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం సాక్షితో మాట్లాడుతూ ఇటీవల కుప్పం నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్, కడా పీడీ నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవెన్యూ సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది సామాన్యుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే కుప్పం రెవెన్యూ కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్న టైపిస్టు దామోదరంను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్టు తెలిపారు. అతను డిజిటల్ కీ దగ్గర పెట్టుకుని అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. ఒక డాక్యుమెంట్ రైటర్‌తో కలిసి అవినీతికి పాల్పడినట్లు బయటపడిందన్నారు. ఈ నేపథ్యంలో టైపిస్టును జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్టు వెల్లడించారు. అతనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని చెప్పారు. అధికారులు తమ తీరు మార్చుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోటెత్తిన కాణిపాకం




క్యూలైన్లలో వున్న భక్తులు

కాణిపాకం: దీపావళి పండుగ నేపథ్యంలో కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్యూలైన్లు నిండిపోయాయి. వారికి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకుని స్వామి వారి దర్శనం కల్పించారు. అలాగే వాహన పూజ మండపం వద్ద ఆయుధ పూజ కోసం ద్విచక్ర వాహనాలు, కార్లు అధిక సంఖ్యలో క్యూకట్టాయి.

కార్తీక మాసంలో ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శివాలయాల సందర్శన కోసం కార్తీక సోమవారాల పేరుతో ప్రత్యేక బస్సులు నడుతున్నట్టు చిత్తూరు టూ డిపో సీఐ అల్తాఫ్ తెలిపారు. ఈ నెల 4, 11, 18, 25 తేదీల్లో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 6 గంటలకు చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో బయలుదేరి తొండవాడలోని ముక్కోటి, తిరుపతిలోని కపిలతీర్థం, శ్రీకాళహస్తీశ్వరాలయం, గుడిమల్లంలోని బ్రహ్మ విష్ణు మహేశ్వరాలయం, కైలాసకోన శివాలయం, వాటర్‌పాల్స్ వరకు తిప్పిస్తామన్నారు. మరో సర్వీసు ఉదయం 5 గంటలకు చిత్తూరు బస్టాండు నుంచి బయలుదేరి మొగిలి శివాలయం, ముళబాగల్ ఆంజనేయ స్వామి ఆలయం, కరుడమలై గణేష్ ఆలయం, కోటి లింగాలు, బంగారు తిరుపతి వెంకటేశ్వరాలయం చూపిస్తామన్నారు. ఈ సందర్శన టికెట్లను ప్రయాణికులు రిజర్వేషన్ కౌంటర్లతోపాటు ఆన్‌లైన్‌లోనూ బుక్ చేసుకోవచ్చని వెల్లడించారు.

వైభవంగా కేదార గౌరీవ్రతం



వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

కాణిపాకం: దీపావళి పండుగను పురస్కరించుకుని కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ అనుబంధ శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కేదార గౌరీ వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయంలో కేదారేశ్వర గౌరీ వ్రతాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

రూ.2.34 కోట్ల విద్యుత్ బిల్లుల వసూలు

చిత్తూరు కార్పొరేషన్: దీపావళి పండుగ రోజు గురువారం ప్రభుత్వ సెలవు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు పనిచేశాయని ట్రాన్స్‌కో తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. మొత్తం 16 వేల మంది వినియోగదారులు బిల్లులు చెల్లించారని, దీంతో సంస్థకు రూ.2.34 కోట్లు వచ్చినట్టు వివరించారు.

మళ్లీ ఏడి పింఛేన్

'మేమొస్తే అవ్వాతాతలకు పింఛను మొత్తాన్ని రెట్టింపు చేస్తాం.. నగదు పంపిణీలోనూ ఇబ్బందులు లేకుండా చూస్తాం' అని కూటమి నేతలు ఎన్నికల్లో గొప్పలు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పింఛనుదారులకు తిప్పలు మొదలయ్యాయి. ప్రతి నెలా నగదు కోసం వృద్ధులు అవస్థలు పడాల్సి వస్తోంది. చిత్తూరు జిల్లాలో శుక్రవారం నవంబర్ పింఛన్ల పంపిణీలో గందరగోళం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సర్వర్ సమస్య తలెత్తడంతో వృద్ధులు చెట్లు, గోడల కింద, సచివాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కులం, మతం, ప్రాంతం, వర్గంతో పనిలేకుండా సంక్షేమ పథకాలను అందజేశారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల కోతకు శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా కూటమి ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులతో పింఛన్లను తొలగిస్తున్నారు. ఫలితంగా ప్రతి నెలా పింఛన్ల సంఖ్య తగ్గిపోతోంది. చిత్తూరు జిల్లాలో పింఛన్ల పంపిణీతోపాటు కోత కోసిన పింఛన్లపై సాక్షి ప్రత్యేక కథనం..



గంగాధరనెల్లూరులో సర్వర్ పనిచేయకపోవడంతో నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

- ప్రతినెలా తగ్గిపోతున్న పింఛన్ల సంఖ్య
- నేతల ఫిర్యాదులతో కూటమి సర్కారు తొలగింపు కుట్ర
- జూలై నుంచి నవంబర్ వరకు తొలగించిన పింఛన్లు 9,184
- చెట్ల కింద, రోడ్లపైనా, సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ
- గత సర్కారులో ఇంటి వద్దకే వెళ్లి అందజేత
- నవంబర్ నెల పింఛన్ల కోసం జిల్లాలో వృద్ధుల అష్టకష్టాలు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వంలో పింఛన్ల తీసివేత పర్వం నడుస్తోంది. ఒకేసారి పెద్ద ఎత్తున తీసేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని భావించి ప్రతి నెలా కొంతమంది పింఛన్లను తొలగిస్తున్నారు. జూలై నుంచి నవంబర్ వరకు జిల్లా వ్యాప్తంగా 9,184 పింఛన్లను తొలగించారు. కొందరివి తెలివిగా హోల్డ్‌లో పెడుతున్నారు. పచ్చనేతల ఫిర్యాదుతో కొందరి పింఛన్లను వలసల పేరుతో పక్కన పెడుతున్నారు. ఇవి తీసివేసినట్లు అధికారికంగా రికార్డుల్లో కనిపించవు. టీడీపీ నేతలు దయతలిస్తే హోల్డ్‌లో నుంచి రిలీవ్ అవుతాయి. లేదంటే కొన్నాళ్లకే పూర్తిగా తొలగించేస్తారు.

ప్రతినెలా కోతలే..

ప్రతినెలా పింఛను కోతలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూలై నుంచి నవంబర్ వరకు 9,184 మంది పింఛన్లను ఆపేశారు. ప్రతి నెలా పింఛన్ల సంఖ్యలో కోత కనిపిస్తూనే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్‌ల కోత పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా కూడా నాయకుల ఒత్తిడి, సిఫార్సు మేరకు మంజూరైన పింఛన్‌లు కూడా చాలా వరకు ఆపేశారు. తాము చెప్పిన వాళ్లకు పింఛన్ సొమ్ము ఇవ్వవద్దని అధికారులకు మౌఖికంగా ఆదేశాలిచ్చారు.

నవంబర్ నెల పింఛన్లకు అష్టకష్టాలు..

జిల్లాలో నవంబర్ నెల పింఛన్లు అందుకునేందుకు పింఛన్‌దారులు అష్టకష్టాలు పడ్డారు. శుక్రవారం ఉదయం ప్రారంభం నుంచే సర్వర్ సమస్య తలెత్తింది. మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరిష్కారం కాలేదు. వృద్ధులు ఆందోళన చెందారు. సచివాలయాల వద్దకు పరుగులు తీశారు. మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. కొంతమంది ఇళ్లకు వెళ్లిపోగా, మరికొంత మంది అక్కడే ఉండి నగదు తీసుకున్నారు.

దివ్యాంగులపైనా చూపని కనికరం

అభాగ్యులపై కుట్రలు కొనసాగుతున్నాయి. వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లను సైతం అనర్హుల పేరుతో గుట్టుచప్పుడు కాకుండా ఏరివేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వేలాది మంది పింఛన్లను తొలగించేశారు. మరికొంత మందివి తొలగించేందుకు వారి అర్హతలను పరిశీలించాలని వైద్యాధికారులకు నివేదికలు పంపినట్టు సమాచారం. అంతటితో ఆగక పరిశీలన కోసం వచ్చిన దివ్యాంగుల సదరం పత్రాల రద్దుకు సిఫార్సు చేయాలని ఫోన్ల ద్వారా, సంబంధిత అధికారుల ద్వారా సతాయిస్తున్నారు. దీంతో గతంలో ఇచ్చిన సర్టిఫికెట్లు తప్పుడివని చెప్పలేక.. ప్రస్తుత పాలకుల ఒత్తిళ్లు భరించలేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పింఛన్లను ఆపేస్తామని, వైద్యుల వద్దకు వెళ్లి పునః పరిశీలన చేసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులు చెప్పడంతో దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు.

నెలవారీగా తొలగించిన పింఛన్ల వివరాలు

జూలై నెలలో	548
ఆగస్టులో	634
సెప్టెంబర్‌లో	1513
అక్టోబర్‌లో	2819
నవంబర్‌లో	3670
మొత్తం	9184

ప్రతి నెలా తగ్గుతున్న పింఛన్ల సంఖ్య

జూలైలో	2,71,253
ఆగస్టులో	2,70,619
సెప్టెంబర్‌లో	2,69,740
అక్టోబర్‌లో	2,68,434
నవంబర్‌లో	2,67,583

- సీఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహించే కుప్పంలోని కుప్పం–3 సచివాలయం వద్దకు వృద్ధులను పిలిపించి పింఛన్లు పంపిణీ చేశారు.
- గంగాధరనెల్లూరు మండలంలో సర్వర్ పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రమైన గంగాధర నెల్లూరులో అందరినీ ఒకచోటకు పిలిపించి రోడ్డుపైనే నగదు ఇచ్చే ప్రక్రియ చేపట్టారు.
- పాలసముద్రం మండలం వనదుర్గాపురం సచివాలయం వద్ద పింఛన్ల కోసం వృద్ధులు పడిగాపులు కాశారు.
- నగరి నియోజకవర్గం విజయపురం మండలం చింతల్‌పత్తం గ్రామానికి చెందిన వృద్ధురాలు పుష్పవాణి నడవలేని పరిస్థితిలో ఉంది. ఇంటి వద్దకు పింఛన్ ఇచ్చేందుకు ఎవరూ రాకపోవడంతో ఆందోళనతో ఆటోలో కాళికాపురం సచివాలయం వద్దకు వెళ్లింది. అక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆవేదనతో వెనుదిరిగింది.
- పలమనేరులోని సముద్రపల్లి సచివాలయం వద్ద పింఛన్ల కోసం వృద్ధులు గంటల కొద్దీ నిరీక్షించారు.

తొలగింపునకు వ్యూహాత్మక కుట్ర

వ్యూహాత్మకంగా మోసం చేయడంలో దిట్ట అయిన చంద్రబాబునాయుడు మరోసారి తన కుట్ర బుద్ధిని బయటపెడుతున్నారు. జిల్లాలో ప్రతినెలా పింఛన్లను గుట్టు చప్పుడు కాకుండా తొలగించే కార్యక్రమానికి తెరతీశారు. లబ్ధిదారుల పిల్లలు ఉద్యోగాలు చేస్తున్నారని, ఆస్తులు ఉన్నాయని, ఇతరత్రా ఆదాయ మార్గాలు ఉన్నాయని కూటమి నేతలతో ఫిర్యాదులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో వివరణ ఇవ్వాలని అధికారులు నోటీసుల జారీ ప్రక్రియ చేపట్టారు. దాదాపు ప్రతి మండలం, ప్రతి గ్రామంలో ఈరకమైన కుట్ర తొలగింపులు సాగుతున్నాయి. నోటీసులకు వివరణ ఇచ్చేలోపు పింఛన్లను పంపిణీ చేయకుండా హోల్డ్‌లో పెడుతున్నారు. ఉదాహరణకు జిల్లా వ్యాప్తంగా జూలై నెలలో 2,68,021 మందికి పింఛన్లు అందజేస్తే నవంబర్‌లో 2,45,841 మందికి పింఛన్లు ఇస్తున్నారు. అంటే 9,184 మంది పింఛన్లను తొలగించేశారు.



పాలసముద్రం: వనదుర్గాపురం వద్ద వృద్ధుల పడిగాపులు



విజయపురం: కాళికాపురం సచివాలయం వద్దకు ఆటోలో వచ్చిన దివ్యాంగురాలు



గంగాధరనెల్లూరు: సర్వర్ సమస్యతో ఇబ్బంది పడుతున్న ఉద్యోగి



ఐరాల మండలం పత్తిపాటివారిపల్లెలో రోడ్డుపై పింఛన్ అందజేస్తున్న సిబ్బంది

రేపే భూమన పదవీ ప్రమాణం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ
- పెద్దసంఖ్యలో తరలిరానున్న జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి నేతలు
- భారీ ఏర్పాట్లు చేసిన పార్టీ శ్రేణులు



తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ఆదివారం పదవీ ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు భారీగా తరలిరానున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. వైఎస్సార్‌సీపీలో మంచి వాగ్ధాటి కలిగిన నేతగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన భూమనకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమించారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకే భూమనకు పదవి కట్టబెట్టినట్లు నేతలు వెల్లడించారు.

భారీ సంఖ్యలో నాయకుల రాక

ఈ నెల 3వ తేది ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా భూమన కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి పార్టీకి చెందిన జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు తరలిరానున్నారు. అందులో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, ప్రభుత్వ మాజీ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి అంబటి రాంబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డితో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రానున్నారు.

కూటమిపై పోరుకు సిద్ధం

కూటమి నేతల దౌర్జన్యాలు, దాడులు, అక్రమ కేసులు, అధికార దుర్వినియోగం చేస్తూ, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వంపై పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సమాయత్తం చేయడంతోపాటు.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భూమన పోరాడనున్నారు. కూటమి ప్రజా ప్రతినిధులు కేవలం వంద రోజుల్లోనే ప్రభుత్వ భూముల ఆక్రమణ, సివిల్ సెటిల్‌మెంట్లు, అక్రమంగా మైనింగ్, ఇసుక స్మగ్లింగ్ మట్టిని సైతం మింగేస్తుండడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేతను మూటగట్టుకున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే మంచి జరిగిందని, కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే అరాచకాలు మొదలయ్యాయని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. ఇలాంటి తరుణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను సమాయత్తం చేయడంతో పాటు.. ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు భూమన నాయకత్వంలో ముందుకు సాగేందుకు పార్టీ సిద్ధమవుతోంది.

ఏర్పాట్లు పరిశీలించిన చెవిరెడ్డి



వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న చెవిరెడ్డి

వేలాది మంది నాయకులు, కార్యకర్తల నడుమ భూమన కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. సభా వేదిక, నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరా తీశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మాట్లాడుతూ పండుగ వాతావరణంలో ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారికి అనుకుని నయారా పెట్రోల్ బంక్ పక్కన ఉన్న మైదానంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈమేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎంపీ గురుమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఎంపీ మిథున్ రెడ్డికి ఘన స్వాగతం



పలమనేరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పలమనేరు : పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శుక్రవారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, డాక్టర్ సునీల్, ఎమ్మెల్సీ భరత్, రాష్ట్ర కార్యదర్శులు మొగసాల కృష్ణమూర్తి, మురళీకృష్ణ, బైరెడ్డిపల్లి ఎంపీపీ రెడ్డెప్ప, మండలాల కన్వీనర్లు జాఫర్, బాలాజీ నాయుడు, మాజీ ఎంపీపీలు రాజేంద్రన్, ఆర్ శ్రీనివాసులు రెడ్డి, నాయకులు చెంగారెడ్డి, ప్రహ్లాద, గణేష్‌యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న గంగవరం పార్టీ కన్వీనర్ మోహన్‌రెడ్డిని పరామర్శించారు.



మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి

ఏపీ అవతరణ దినం.. అదృశ్యం

- ఆరుకోట్ల ఆంధ్రులను సీఎం అవమానించారు
- గత ప్రభుత్వంలో నవంబర్ 1న అవతరణ దినోత్సవం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా



మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : ఆంధ్రప్రదేశ్‌కి అవతరణ దినం కనుమరుగైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఆమె శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రానికి పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలో అవతరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాయని, ఆంధ్రప్రదేశ్‌కు అవతరణ దినం కనుమరుగైందని వెల్లడించారు. నవంబర్ 1న అవతరణ దినోత్సవాన్ని నిర్వహించకుండా ఆరుకోట్ల ఆంధ్రులను, ఆంధ్ర రాష్ట్రాన్ని చంద్రబాబునాయుడు అవమానించారని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అవతరణ దినోత్సవం నిర్వహించకుండా పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగాన్ని అవహేళన చేశారని మండిపడ్డారు. ''ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించరా? ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమేనా? మీరు అసలు పాలకులేనా? ఆంధ్రప్రదేశ్ ఎప్పుడు అవతరించిందని అడిగితే.. భావితరాలకు ఏం సమాధానం చెప్తారు'' అంటూ ఆమె ప్రశ్నించారు. ఇంతటి దారుణం రాష్ట్రంలో ఎప్పుడూ జరగలేదని తెలిపారు. ఇలా చేసినందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్టాంప్ పేపర్స్ పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నాన్‌జ్యుడిషియల్ స్టాంప్ పేపర్స్ అందజేస్తున్నట్టు జిల్లా రిజిస్ట్రార్ మునిశంకరయ్య తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ నుంచి జిల్లాకు రూ.16 లక్షల విలువైన రూ.50 స్టాంప్ పేపర్స్, రూ.32 లక్షల విలువైన రూ.100 స్టాంప్ పేపర్స్‌ను తెప్పించామని వెల్లడించారు. వీటిని జిల్లాలోని 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. శనివారం నుంచి వినియోగదారులు పొందవచ్చని వివరించారు. అదేవిధంగా ఈ–స్టాంప్ పేపర్స్ సైతం అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా అందజేస్తామన్నారు.

ఘనంగా ఐక్యతా పరుగు



పరుగు పందెంలో పాల్గొన్న పోలీసులు, యువకులు

చిత్తూరు అర్బన్: దేశ మొదటి హోమ్ మంత్రిగా భారత్‌లోని సంస్థానాలను విలీనం చేసి భారత దేశ ఐక్యతకు మారుపేరుగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గురువారం చిత్తూరు పోలీసు శాఖ ఐక్యతా పరుగు (రన్ ఫర్ యూనిటీ)ను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని చిత్తూరు నగరంలోని గాంధీ కూడలి వద్ద ఎస్పీ మణికంత చందోలు జెండా ఊపి ప్రారంభించారు. పోలీసుశాఖ సిబ్బందితో పాటు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ దేశాన్ని ఒక్కటిగా చేయడంతోపాటు దేశ సమగ్రత కోసం వల్లభాయ్ పటేల్ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. దేశంలో కలవడానికి కొన్ని సంస్థానాలు అంగీకరించకపోయినప్పుడు సర్దార్ జీ తీసుకున్న నిర్ణయాలు ఆయన్ను ఉక్కు మనిషిగా నిలబెట్టినట్టు వివరించారు. ఈ పరుగు పందెంలో ఎస్పీ మణికంఠతో పాటు ఆయన సతీమణి హర్షిత పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్, డీఎస్పీలు సాయినాథ్, మహబూబ్ బాష, సీఐలు నెట్టికంటయ్య, నిత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు తిరుపతికి చెందిన మనోహర కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.1,00,116 విరాళం ఇచ్చారు. ఆ నగదును ఆలయ సిబ్బందికి అందజేశారు. వారికి అధికారులు స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అడ్వెంచర్ క్యాంపునకు కల్లూరు విద్యార్థి



విద్యార్థి హేమాద్రి

కల్లూరు(పులిచెర్ల): హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న అడ్వెంచర్ క్యాంపునకు ఆంధ్రప్రదేశ్ నుంచి కల్లూరులోని వీఆర్ఆర్ కళాశాలలో మూడో ఏడాది డిగ్రీ చదువుతున్న రాగల హేమాద్రి ఎంపికై నట్లు కరస్పాండెంట్ సురేష్‌బాబు, జిల్లా లయన్స్ క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షుడు మహ్మదాలి తెలిపారు. ధర్మశాలలో 11వ తేదీ వరకు జరిగే శిక్షణలో విద్యార్థి పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు. అక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు 2025 జనవరి 26న జరిగే రిపబ్లిక్ డేలో పాల్గొంటారని వెల్లడించారు.

ప్రగతి తప్పిన ఆర్టీసీ



- పనిముట్లు లేక మెకానిక్కుల అవస్థలు
- మరమ్మతులకూ నోచుకోని వైనం
- మొరాయిస్తున్న బస్సులు
- పట్టించుకోని ప్రభుత్వం

■ కుప్పం ఆర్టీసీ డిపోకు చెందిన కుప్పం –క్రిష్ణగిరి సర్వీసు బస్సు ఆగస్టు 10వ తేదీన మొరాయించింది. ప్రయాణికులు తలా ఒక చేయి వేసి నెట్టినా ప్రయోజనం లేదు. బస్సు ముందుకు కదలలేదు. తీరా విచారిస్తే గ్యారేజీలో విడిభాగాల కొరత వేధిస్తోందని తెలిసింది. 156 పరికరాలు కావాలని నివేదిక పంపితే 16 మాత్రమే వచ్చినట్టు సమాచారం. దీంతో బస్సులకు మరమ్మతులు చేయలేక మెకానిక్కులు తలలు పట్టుకుంటున్నారు. ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

■ గత నెలలో చిత్తూరు వన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పైపు విరిగింది. నగరంలోని నడిరోడ్డుపై బస్సు ఆగిపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు వేరే బస్సుకు తాడు కట్టి లాక్కొచ్చారు. గ్యారేజీలో వాటికి సంబంధించిన పరికరాలు కొన్ని లేకపోవడంతో వేరే చోటి నుంచి తెప్పించి బిగించారు. మరమ్మతులు చేయడానికి విడిభాగాలు లేకపోవడంతో తరచూ బస్సులు మొరాయిస్తున్నాయి.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సుఖప్రదం.. సురక్షితం.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి సంస్థను ప్రగతి పథంలో నడిపించండి.. ఇవి అధికారులు ఇస్తున్న నినాదాలు.. సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్టీసీపై శీతకన్ను వేసింది. బస్సుల నిర్వహణను గాలికొదిలేసింది. మరమ్మతులు చేయడానికి పరికరాల కొరతతో కండీషన్ తప్పి బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. ఉన్నవాటితోనే మరమ్మతులు చేయలేక మెకానిక్కులు తలలు పట్టుకుంటున్నారు. తద్వారా ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

కాణిపాకం : చిత్తూరు జిల్లాలో 5 ఆర్టీసీ డిపోల పరిధిలో 395 బస్సులున్నాయి. ఇవి రోజుకు 2,525 ట్రిప్పులు నడుస్తూ 1.68 లక్షల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. 1,08,986 మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీకి రోజుకు రూ.56 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ప్రభుత్వం బస్సుల కండీషన్‌ను గాలికొదిలేసింది. మరమ్మతులు చేయడానికి నిధులు విదల్చకుండా ఆర్టీసీ ప్రగతి రథ చక్రాలకు పంక్చర్ చేసి ప్రయాణికుల ప్రాణాలను గాలిలో దీపాలుగా మార్చేస్తోంది. కొన్ని బస్సులు కాలం తీరిపోవడంతో ఎక్కడికక్కడికి పైపులు విరిగిపోతున్నాయి. మరికొన్ని ఎక్కడపడితే అక్కడ ఆగిపోయి మొరాయిస్తున్నాయి. దీంతో అధికారులు బస్సు సర్వీసులకు కోతలు పెడుతున్నారు. కొన్ని గ్రామాలకు బస్సులను రద్దు చేస్తున్నారు. ప్రజలకు ఆటోలు, ప్రైవేటు వాహనాలే దిక్కుగా మారుస్తున్నారు. ఇందుకు డిపో గ్యారేజీల్లో పూర్తి స్థాయిలో పరికరాలు లేకపోవడమే కారణమనే విమర్శలు వస్తున్నాయి.

సక్రంగా అందని విడి భాగాలు ఇవే...

- జాయింట్‌లో స్టార్లు
- జాయింట్‌కు బ్రాకెట్
- స్టీరింగ్ వెల్ పంపు
- గేర్ లివర్లు
- జాయింట్ ఫ్లాంజులు
- కట్టాకు వచ్చే రబ్బర్లు
- పేస్టులు.. మరో 10కి పైగా పరికరాలు

గుంతల రోడ్లు..కాలం చెల్లిన బస్సులు

గత నెలలో తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. రోడ్లలో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. వాటిని పూడ్చకపోవడం.. కాలం చెల్లిన బస్సులను తిప్పడంతో కట్టర్లు దెబ్బతినడంతో పాటు టైర్లు పాడైపోతున్నాయి. పలుమార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఆయా సమస్యలతో బస్సులు ఎక్కువగా గ్యారేజీలకు చేరుతున్నాయి. మరమ్మతులు చేయడానికి పరికరాలు కావాలని ఉన్నతాధికారులకు ఉద్యోగులు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ సకాలంలో మంజూరు కావడం లేదు. అరకొరగా 20 శాతం నుంచి 50 శాతం వరకు మాత్రమే అందించి చేతులు దులుపుకుంటున్నారు. పక్షంలో కొన్ని విడిభాగాలు స్థానికంగానే కొనుగోలు చేస్తున్నారు. పాత వాటిని తీసుకుని కొత్తగా ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. దీంతో గ్యారేజీ సిబ్బంది కూడా అందుబాటులో ఉన్న సామగ్రితో నామమాత్రంగా మరమ్మతులు చేస్తున్నారు. లేనిపక్షంలో బస్సుల నుంచి బస్సులకు పరికరాలను మారుస్తున్నారు. అనంతరం వాటినే రోడ్లపై తిప్పుతున్నారు.

బస్సుల్లో ప్రధాన సమస్యలు

బస్సుల్లో ప్రధానంగా జాయింట్, స్టీరింగ్, జాయింట్‌లో బేరింగ్, స్టార్ సమస్యలు తలెత్తుతుంటాయని మెకానిక్కులు చెబుతున్నారు. స్టీరింగ్ పంపు పనిచేయకపోవడంతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొంటున్నారు. అంతేగాక గేర్ లివర్‌లో కదలికలతో గేర్ వేసే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదని, వైపర్లు పనిచేయడం లేదని వెల్లడిస్తున్నారు. పలుచోట్ల జాయింట్లు, బుష్‌లు అరిగిపోవడంతో బస్సు బాడీ దడ..దడలతో శబ్దం వస్తుందని చెబుతున్నారు.

ఆర్టీసీ బస్సు వివరాలు...

బస్సుల సంఖ్య	సర్వీసులు	కి.మీ
చిత్తూరు–1	78	35533
చిత్తూరు–2	92	39700
పలమనేరు	48	18386
పుంగనూరు	77	33075
కుప్పం	100	42131
మొత్తం	395	168825

ప్రమాదాలకు దారి...

డ్రైవర్ తప్పిదాలతో 20 నుంచి 30 శాతం వరకు రోడ్డు ప్రమాదాలు జరిగితే... 80 శాతం వరకు కండీషన్‌లేని బస్సుల వల్లే జరుగుతున్నట్టు సీనియర్ మెకానిక్కులు అంటున్నారు. స్పేర్స్ లేని సమయంలో ఒక బస్సులోని విడిభాగాలను మరో బస్సుకు మారుస్తుంటారు. ఇలా చేయడంతో బస్సులు మొరాయిస్తుంటాయి. లేకుంటే రాడ్లు, పైపులు విరిగి, ఇతరత్రా కారణాలతో ప్రమాదాలు జరుగుతాయి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి కండీషన్ లేని బస్సులకు బ్రేకులు వేసి.. పూర్తి స్థాయిలో విడిభాగాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లేని పనిముట్లు ...

పాత వాహనాలు అధికంగా తిరుగుతున్నాయి. ప్రస్తుతం వస్తున్న వాహనాలు బీఎస్ -6 మోడల్‌కు చెందినవి. వీటికి సంబంధించిన కిట్లు గ్యారేజీలో లేవన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏసీ బస్సులకు అసరమైన స్పెషల్ టూల్స్ ఇవ్వడం లేదని కార్మికులు అంటున్నారు. పాతబండ్ల విషయానికి వస్తే.. స్టీల్ బిట్లు, బిట్లు -10, బిట్ రాడ్లు-10, రించ్-10, స్పేనర్స్ -10, రివిట్ గన్ ఇవ్వడం లేదు. దీంతో గ్యారేజీలో బండి రిపేర్‌కు కుస్తీ పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.



సమస్యలుంటే చెప్పండి



గ్యారేజీలో విడిభాగాలు లేవని ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. కొరత ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలి. అవసరమైన మేరకు పరికరాలను తెప్పించే ప్రయత్నం చేస్తాం. పనిముట్లు అవసరమైతే డిపోల వారిగా నివేదికలు ఇస్తే తెప్పిస్తాం. బీ–6 అనేది కొత్తరకం బండ్లు. వాటికి కూడా పూర్తి స్థాయిలో విడిభాగాలు తెప్పిస్తాం.

– జగదీష్, డీపీటీపీ, చిత్తూరు

అంతర జిల్లాల టెన్నిస్ టోర్నమెంట్‌లో విద్యార్థిని ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని

ఐరాల: 68వ అంతర జిల్లాల టెన్నిస్ టోర్నమెంట్‌లో ఐరాల మండలం పొలకలకు చెందిన విద్యార్థిని సాయి సంజనారెడ్డి ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమె ఇటీవల కాకినాడలో నిర్వహించిన 68వ అంతర జిల్లా టెన్నిస్ టోర్నమెంట్‌లో అండర్–14 బాలికల విభాగం పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచింది. త్వరలో పూణేలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అండర్–14 టెన్నిస్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొననుంది. విద్యార్థినిని పూతలపట్టు మండలంలోని పేటమిట్ట మంగళ విద్యాలయ యాజమాన్యం అభినందించింది.

జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను జనవరి, ఫిబ్రవరి నెలల్లో సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పెన్షనర్స్ తొందరపడి నవంబర్, డిసెంబర్ నెలల్లో లైఫ్ సర్టిఫికెట్‌లు అందజేస్తే ఏప్రిల్‌లో పెన్షన్‌ను నిలిపివేస్తారని తెలిపారు. గతంలో చాలా మందికి ఇలాంటి సమస్య తలెత్తిందని, ఎవరూ తొందరపడొద్దన్నారు. అదేవిధంగా జిల్లాలోని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో తమ ఇన్‌కంట్యాక్స్‌ని సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసి పంపాలని వెల్లడించారు. సేవింగ్స్ వివరాలు పంపకపోతే న్యూరెజిమ్‌గా పరిగణించి ఇన్‌కంట్యాక్స్ రికవరీ చేస్తారని తెలిపారు. గత నెల గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర ఈసీ సమావేశంలో పలు అంశాలపై చర్చించామన్నారు. 70, 75 ఏళ్లు దాటిన వారికి క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌లు, కమ్యుటేషన్‌ను 12 ఏళ్లకు కుదించాలని ఏకగ్రీవంగా ఆమోదించినట్టు పేర్కొన్నారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీసీహెచ్ఎస్

బైరెడ్డిపల్లె : మండల కేంద్రమైన బైరెడ్డిపల్లెలో ఉన్న పీహెచ్‌సీని శుక్రవారం డీసీహెచ్ఎస్ ప్రభావతి తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్ పరీక్షలు, కాన్పుల గది, సిబ్బంది పనితీరును పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులు, మాతా శిశు సంరక్షణ సేవలను ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌చంద్ర, సిబ్బంది శ్రీవాణి, అనూరాధ, గోపి, జిలానీ, సారామతి, మాధవి పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత డెమో తరగతులు

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ అభ్యర్థుల సౌకర్యార్థం చిత్తూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఉచిత డెమో తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కుట్టి డీఎస్సీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పవనకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరులో శనివారం, వి.కోటలో ఆదివారం నిష్ణాతులతో డెమో తరగతులు ఇప్పిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు 9490795693, 9491844963 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



మృతి చెందిన జానకిరామ్‌శెట్టి

బంగారుపాళెం : మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ శాంతి నగర్‌లో గురువారం విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నలగాంపల్లెకు చెందిన జానకిరామ్‌శెట్టి(47) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శాంతినగర్‌లో నిర్మిస్తున్న భవనంలో వైరింగ్ పని చేయిస్తున్నాడు. గురువారం ఫ్యాన్లు అమర్చుతుండగా షాక్‌కు గురయ్యాడు. స్థానికులు అతన్ని బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టరు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఐరాల మండలంలో..



ధనంజయ ఫైల్

ఐరాల: మండలంలోని చెంగనపల్లెలో గురువారం విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ నరసింహులు కథనం మేరకు.. చెంగనపల్లెకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ క్రిష్ణయ్య పెద్ద కుమారుడు వై.ధనుంజయ(23) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. గురువారం సాయంత్రం దీపావళి సందర్భంగా ఇంటి మిద్దెపైన దీపాలు వెలిగించడానికి వెళ్తుండగా విద్యుత్ షాక్ గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన వినోద్‌కుమార్

పలమనేరు: పట్టణ సమీపంలోని గొబ్బిళ్లకోటూరు వద్దనున్న పాడుబడిన వ్యవసాయ బావిలో యువకుడు గాయాలతో మృతి చెందిన విషయాన్ని స్థానికులు గురువారం గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ నరసింహరాజు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికితీయించారు. విచారణలో అతను పలమనేరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన సుజాత కుమారుడు వినోద్‌కుమార్(35)గా తెలిసింది. శరీరంపై రక్తగాయాలు ఉన్నా యి. సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

అర్హులైన వారికి ఉచిత గ్యాస్ పథకం

గుడిపాల/చిత్తూరు రూరల్ : సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం గుడిపాల మండలం నరహరిపేట హైస్కూల్ లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం కింద దీపం–2లో పేదలకు ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం అందించనుందన్నారు. సిలిండర్‌కు వెచ్చించిన సొమ్మును 48 గంటల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తామన్నారు. దీనికోసం 2025 మార్చి 31 వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించారు.

రాష్ట్రంలో ఎలక్ట్రికల్ బస్సులు: రాబోయే కాలంలో ఎలక్ట్రికల్ బస్సులను తీసుకొస్తామని రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో 10 కొత్త సర్వీసులను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు, జీడీనెల్లూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్, థామస్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, డీఎస్‌ఓ శంకరన్, ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంపీడీవో శివరాజన్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం ఉంటేనే పనులు చేస్తా

శ్రీరంగరాజపురం : టీడీపీ సభ్యత్వం కార్డు ఉంటేనే వ్యక్తిగత పనులు చేస్తామని, కాంట్రాక్ట్ పనులు అప్పగిస్తామని గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. శ్రీరంగరాజపురంలో శుక్రవారం ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైతే ఎక్కువగా టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయిస్తారో, వారికే కాంట్రాక్ట్ పనులు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలకు గ్యాస్ సిలిండర్ అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి యత్నం



అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్న యువకుడు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని శంకరయ్య గుంటలో ఓ వ్యక్తి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించాడు. టూ టౌన్ సీఐ నెట్టి కంటయ్య కథనం మేరకు.. శంకరయ్య గుంటకు చెందిన సంతోష్‌కుమార్ అనే యువకుడు శుక్రవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించాడు. దీన్ని గమనించిన స్థానికులు యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందజేశారు. యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఘటనపై విచారిస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి
- బాధితులకు పరామర్శ



దొరస్వామి రెడ్డికి నివాళులర్పిస్తున్న నారాయణస్వామి

వెదురుకుప్పం : కార్యకర్తలకు అండగా ఉంటామని, ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. ఆయన శుక్రవారం వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మాజీ యువత మండల అధ్యక్షుడు బోడిరెడ్డి నరేష్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదని, మంచి చేస్తే ప్రజలు గుర్తు పెట్టు కుంటారని హితవుపలికారు. ప్రతిపక్ష నేతలపై దాడులు చేయించడం, అక్రమంగా కేసులు పెట్టించడం ద్వారా ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అశాంతి నెలకొంటుందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వెదురుకుప్పం మండలంలో ఎస్సీ, ఎస్టీ కేసులు అధికంగా నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలు తిరగబడితే ఏ రాజకీయ పార్టీ అయినా మనగడ కోల్పోతుందని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన తిరుమలయ్యపల్లె పంచాయతీ కొండకిందపల్లెలో ఇటీవల మృతి చెందిన దొరస్వామి రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దొరస్వామి రెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, ఈశ్వరరెడ్డి, ధర్మయ్య, మోహన్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి, చందు ఉన్నారు.

దుమ్మురేపిన కోడెగిత్తలు



దూసుకుపోతున్న కోడెగిత్తలు

- పలకల కోసం యువకుల పోటీ
- జగనన్న నినాదంతో హోరెత్తిన కోణంగిపల్లె

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ కోణంగిపల్లెలో గురువారం నిర్వహించిన ఎడ్ల పందేలు (జల్లికట్టు) యువతలో జోష్ తెచ్చింది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని యువత ఆధ్వర్యంలో చేపట్టిన ఎడ్ల పందేలు దుమ్మురేపాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో వీధులు కిక్కిరిశాయి. యువకులు కోడెగిత్తల వెంట పరుగులు తీస్తూ జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు. నిర్వాహకులు ముందుగా ఎడ్లకు పలకలు, వస్త్రాల తో పాటు బెలూన్‌లు కట్టి పందేనికి సిద్ధం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటా లతో కూడిన పలకలను ప్రత్యేకంగా తయారు చేయించడం ఆకట్టుకుంది. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకు న్న యువత పలకలు సాధించేందుకు సిద్ధమయ్యా రు. నిర్వాహకులు ఎడ్లను ఉసిగొల్పి వదిలడంతో వాటిని నిలువరించి ఎలాగైనా పలకలు పట్టాలన్న ఆతృతతో యువకులు పోటీ పడ్డారు. కొందరు పలకలు సాధించి విజయ దరహాసంతో చిందులు వేశారు. కొన్ని ఎడ్లు యువతకు చిక్కకుండా పరుగులు తీశాయి.



పశువులను నిలువరిస్తున్న యువకులు

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరులో శుక్రవారం బైక్ ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి మృతి చెందాడు. కర్నూలుకు చెందిన డ్రైవర్ శ్రీనివాస్ లారీని చిత్తూరు నగరం మురకంబట్టు ప్రాంతంలో నిలిపి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో కోడిగుట్టకు చెందిన శివ ద్విచక్ర వాహనంలో వేగంగా వస్తూ ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. చిత్తూరు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.